
ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో బీఆర్‌ఎస్ నాయకులు

## ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి పలువురి శుభాకాంక్షలు

నాగారం, డిసెంబర్ 7 : సూర్యాపేట ఎమ్మెల్యేగా మరోమారు విజయం సాధించిన గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని బీఆర్‌ఎస్ నాగారం మండల నాయకులు గురువారం మండల కేంద్రంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలోని ఆయన ఇంట్లో కలిసి స్వీట్లు తినిపించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ గుండగాని అంబయ్యగౌడ్, అధికార ప్రతినిధి చిల్లర చంద్రమౌళి, పొదిల రమేశ్, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు ఈదుల కిరణ్‌కుమార్, నాయకులు కూర వెంకన్న, మంచినీళ్ల మహేందర్, చిప్పలపల్లి మల్లేశ్, ఉపేందర్, బడేసాబ్, మధు, గ్రామస్తులు పాల్గొన్నారు

## విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి

- డీఈఓ భిక్షపతి


మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

దామరచర్ల, డిసెంబర్7 : విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించాలని డీఈఓ బొల్లారం భిక్షపతి సూచించారు. గురువారం మండలం కేంద్రంలోని జడ్పీహైస్కూల్లో నిర్వహించిన ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు తొలిమెట్టు, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఉన్నతి సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. సమగ్ర శిక్షణ ద్వారా స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థుల వారీగా ప్రారంభ పరీక్ష గ్రేడ్ అప్లోడ్ చేయాలన్నారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో సమగ్రంగా నైపుణ్యం సాధించి ఏ గ్రేడ్ పొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ మాలోతు బాలాజీనాయక్, నోడల అధికారి కేతావత్ సైదానాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం పొలగాని పిచ్చయ్య, రిసోర్స్ పర్సన్లు సైదిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బైరం బాలరాజు, మధుకర్ పాల్గొన్నారు.

## ఫిజియో థెరపీకి విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలి


ఫిజియో థెరపీ నిర్వహిస్తున్న వైద్యుడు

నూతనకల్, డిసెంబర్ 7 : ఫిజియో థెరపీ కోసం ప్రత్యేక అవసరాలు గల పిల్లలు తాము చదివే పాఠశాలల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఎంఈఓ రాములునాయక్ సూచించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ అందించడం ద్వారా వారిలో మనో ధైర్యాన్ని పెంచవచ్చునన్నారు. ప్రతి గురువారం ఎమ్మార్సీ భవనంలో ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిజియోథెరపీ డాక్టర్ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కనులపండువగా అయ్యప్ప పడిపూజ


అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్న మాలధారులు

బొ డ్రా యి బ జా ర్, డిసెంబర్ 7 : జిల్లా కేంద్రంలోని శభరినగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం రాత్రి అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్వాములు భక్తి శ్రద్ధలతో అయ్యప్పస్వామిని పూజించారు. కార్యక్రమంలో గోరుగంటి రవీందర్‌రావు, ఆలయ కమిటీ ప్రదాన కార్యదర్శి ఎల్గూరి రాంబాబు, కోశాధికారి బచ్చు శ్రీనివాస్, మనసాని రామ్మూర్తి ఉన్నారు.

# ప్రభుత్వ దవాఖానల్లో నార్మల్ డెలివరీలు పెంచాలి

- డీఎంహెచ్‌ఓ కోటాచలం


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

తిరుమలగిరి, డిసెంబర్ 7 : ప్రభుత్వ దవాఖానల్లో నార్మల్ డెలివరీల సంఖ్యను పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం వైద్య సిబ్బంది ఆదేశించారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో పాటు గర్భిణులు, స్త్రీలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో గర్భిణులకు పరీక్షలు నిర్వహించ చడంతో పాటు చికిత్స అందించేందుకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించామన్నారు. గర్భిణులు ప్రతి నెలా ప్రభుత్వ దవాఖానల్లోనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానల్లోనే సాధారణ కాన్పులు అవుతున్నా యని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వందన, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, వైద్య సిబ్బంది, వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నూతనకల్, డిసెంబర్ 7 : గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంవీఎఫ్ మండల ఇన్‌చార్జి చిప్పెలపల్లి రవి కోరారు. గురువారం మండలంలోని మాచనపల్లి గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై కిశోర బాలికలకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల చిన్నతనంలోనే వారు కుటుంబ భారం మోయాల్సి రావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాలికలకు 18 ఏండ్లు, బాలురకు 21ఏండ్లు వచ్చే వరకు వివాహం చేయకూడదని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో విజయ, ధనమ్మ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## 108లో ప్రసవం

మోత్కూరు, డిసెంబర్ 7 : మోత్కూరు మున్సిపాలిటీకి చెందిన పి విజయలక్ష్మి రెండో కాన్పు కోసం గురువారం స్థానిక పీహెచ్‌సీకి వెళ్లింది. అక్కడే పురిటి నొప్పులు రావడంతో ఆశ వర్కర్ బైరు అనిత 108 వాహనానికి సమాచారం అందించి, అదే వాహనంలో నల్లగొండ ప్రభుత్వ దావఖానకు తరలించింది. మార్గ మధ్యంలో నార్కట్‌పల్లి సమీపంలో విజయలక్ష్మికి పురిటి నొప్పులు అధికం కావడంతో 108 సిబ్బంది ఆశవర్కర్ సహకారంతో వాహనంలోనే కాన్పు చేశారు. విజయలక్ష్మి మగబిడ్డకు జన్మనివ్వగా తల్లీబిడ్డను నల్లగొండలోని మాతా శిశుకేంద్రానికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది శశికిరణ్, లాధినేని సోమేశ్వర్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మునగాల, డిసెంబరు 7: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయరాఘవపురం గ్రామానికి చెందని పస్తం శ్రీను(47) ఈ నెల 3న బైక్‌పై మోతె నుంచి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలో నాగార్జుననగర్ సమీ పంలో ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీ కొట్టింది. దాంతో శ్రీనుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఉస్మానియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శ్రీను గురువారం మృతి చెందాడు. మృతుడి శ్రీను బావమర్ధి సైదులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు.

## తపాలా ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయాలి

నేరేడుచర్ల, డిసెంబర్ 7 : ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్ పిలుపు మేరకు గ్రామీణ తపాల ఉద్యోగుల ఈ నెల 12నుంచి చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ నేరేడుచర్ల పోస్టాఫీస్‌లో గురువారం సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం సూర్యాపేట డివిజన్ కన్వీనర్ జి.నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ తపాల ఉద్యోగులకు 8గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు కల్పించాలన్నారు. సీనియర్ ఉద్యోగులకు 12,24,36సంవత్సరాల సర్వీస్‌కు అదనపు ఇంక్రిమెంట్ మంజూరు చేసి ఆర్థిక ఉన్నత కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5లక్షలు, గ్రాట్యూటీని రూ. 5లక్షలకు పెంచాలన్నారు. కుటుంబసభ్యులు వైద్య సౌకర్యం కల్పించాలని, టార్గెట్ మేళాల వేధింపులను నిలిపివేయాలని తదితర సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టినట్లు తెలిపారు. సమ్మెలో గ్రామీణ తపాల ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు రామ నర్సయ్య, రమేశ్, జ్యోతి, చెన్నయ్య, పుల్లయ్య, నారాయణ, అశ్విని, ఉష, సునీత, శివ పాల్గొన్నారు.



నేరేడుచర్లలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రామీణ తపాల ఉద్యోగులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్‌రెడ్డి

## స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

- ఎంపీపీ రవీందర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్, డిసెంబర్ 7 : గ్రామాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందికి నిర్వహించిన సమీక్షలో పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా నర్సరీల పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీల రికార్డులను సోషల్ ఆడిట్‌లో సమర్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, ఎంపీఓ పరాంకుశరావు, ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## చెల్లని చెక్కు కేసులో ప్రభుత్వ ఉద్యోగికి జైలుశిక్ష

సూర్యాపేట లీగల్, డిసెంబర్ 7 : చెల్లని చెక్కు ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగికి సంవత్సరం సాధారణ జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సూర్యాపేట ప్రథమశ్రేణి న్యాయమూర్తి కె.సురేశ్ గురువారం తీర్పునిచ్చారు. నడిగూడేనికి చెందిన చల్లా రాజశేఖర్(35), కట్టా దయాకర్ స్నేహితులు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న రాజశేఖర్ తన అవసరాల నిమిత్తం దయాకర్ వద్ద 2017 ఏప్రిల్ 24న రూ.70వేలు, 2018 డిసెంబర్ 27న మరో రూ.3లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దయాకర్ తిరిగి డబ్బులు ఇమ్మని అడిగితే రూ.4,45,000లకు చెక్కు ఇచ్చాడు. బ్యాంకులో వేయగా డబ్బులు లేని కారణంగా చెక్కు చెల్లలేదు. బాధితుడు న్యాయవాదితో నోటీస్ పంపగా డబ్బులు చెల్లించలేదు. దాంతో బాధితుడు కోర్టును ఆశ్రయించగా.. గురువారం సాక్షులను విచారించిన న్యాయస్థానం నేరం రుజువు కావడంతో రాజశేఖర్‌కు సంవత్సరం సాధారణ జైలు శిక్ష, రూ.8.90లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, చెల్లించని పక్షంలో అదనంగా మరో 3నెలల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పునిచ్చారు.